

శుక్రవారం కోల్‌కతాలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న బెంగాల్ సీఎం మమత

# కాంగ్రెస్ పనైపోయింది!

## దేశవ్యాప్తంగా కనీసం 40 ఎంపీ సీట్లు కూడా రావు

- మోదీని ఓడించే దమ్ము కాంగ్రెస్‌కు ఉన్నదా?
- వేషగాళ్లు ఊర్లు పట్టుకొని తిరుగుతున్నారు జాగ్రత్త
- కాంగ్రెస్‌పై పశ్చిమబెంగాల్ సీఎం మమత ధ్వజం

కోల్‌కతా: వారణాసిలో ప్రధాని మోదీని ఓడించే దమ్ము కాంగ్రెస్‌కు ఉన్నదా? అని పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ ప్రశ్నించారు. ముర్షిదాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో మమత మాట్లాడుతూ 'లోక్‌సభ ఎన్నికల్లో 300 స్థానాల్లో పోటీ చేస్తామని కాంగ్రెస్ చెప్తున్నది. ఈ 300 స్థానాల్లో కనీసం 40 చోట్లనైనా గెలుస్తుందన్న నమ్మకం నాకు లేదు. నిజంగా కాంగ్రెస్‌కు దమ్ము ఉంటే వారణాసిలో ప్రధాని మోదీని ఓడించాలి. వారణాసి అనే కాదు.. అలహాబాద్.. ఇలా ఒక్కొక్కటి చెప్పుకుంటూ పోతే ఎన్నిచోట్ల గెలువగలరో చెప్పే దమ్ము కాంగ్రెస్‌కు ఉన్నదా? గత లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన స్థానాల్లో కూడా ఈసారి కాంగ్రెస్ ఓడిపోతుంది. కాంగ్రెస్ పనైపోయింది' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన న్యాయ్‌యాత్రను ఉద్దేశించి మమత స్పందిస్తూ 'ప్రస్తుతం కొత్త వేషగాళ్లు ఊర్లు పట్టుకొని తిరుగుతున్నారు. కనీసం చాయ్ దుకాణానికి వెళ్లడానికి ఇష్టపడనివాళ్లు ఇప్పుడు బీడీ కార్మికులతో ఫొటోలకు పోజులిస్తున్నారు. వారంతా వలస పక్షులు. ప్రస్తుతం నడుస్తున్నదంతా ఫొటోషూట్ మాత్రమే' అని మమత ధ్వజమెత్తారు.

### కేంద్రం బకాయిలు విడుదల చేయాలి

కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ మమతాబెనర్జీ కోల్‌కతాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, పీఎం ఆవాస్ యోజన ఇలా పలు పథకాలకు సంబంధించి కేంద్రం నుంచి వేల కోట్ల రూపాయలు రాష్ట్రానికి రావాల్సి ఉన్నదని చెప్పారు. బకాయిలను విడుదల చేయాలంటూ ఇప్పటికే పలు సార్లు విజ్ఞప్తి చేశామని, అయినా కేంద్రం స్పందించడం లేదని పేర్కొన్నారు.

## పరువు నష్ట చట్టాన్ని కొనసాగించాలి: లా కమిషన్

న్యూఢిల్లీ: భారత్‌లోని క్రిమినల్ చట్టాల్లో పరువునష్ట నేరాలకు సంబంధించిన చట్టాన్ని కొనసాగించాలని లా కమిషన్ సిఫారసు చేసింది. రాజ్యాంగంలోని 21వ అధికరణ దేశంలోని పౌరులందరికీ పరువు హక్కును కల్పిస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యమని పరువు నష్ట నేర చట్టంపై రూపొందించిన నివేదికలో ఉద్ఘాటించింది. జీవన, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులో ఓ కోణంగా ఉన్న పరువు హక్కుకు విద్వేష ప్రసంగాలు, ఆరోపణల నుంచి 'తగినంత రక్షణ' కల్పించాల్సిన అవసరమున్నదని స్పష్టం చేసింది.

### ధ్వంసం చేసిన ఆస్తికి పరిహారం చెల్లిస్తేనే నిందితులకు బెయిల్

ప్రభుత్వ ఆస్తుల విధ్వంసాన్ని నిరోధించేందుకు నిబంధనలను కఠినతరం చేయాలని లా కమిషన్ సిఫారసు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆస్తుల విధ్వంసం జరిగినపుడు నమోదయ్యే కేసుల్లో నిందితులు బెయిల్ పొందాలంటే, తాము ధ్వంసం చేసిన ఆస్తి విలువకు సమానమైన సొమ్మును జమ చేయవలసి ఉంటుందని కమిషన్ ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తున్నది.

# దేశాన్ని విభజించండి!

## దక్షిణాదిని ప్రత్యేక దేశంగా ప్రకటించండి

- కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ వివాదాస్పద వ్యాఖ్యలు
- నిధుల విషయంలో దక్షిణాదిపై వివక్ష ఉందని ఫైర్
- కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు
- ఎథిక్స్ కమిటీ విచారణకు బీజేపీ డిమాండ్
- సురేశ్ వ్యాఖ్యలను సహించబోమన్న ఖర్గే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): నిధుల కేటాయింపుల విషయంలో కేంద్రంలోని బీజేపీ సర్కారు దక్షిణాది రాష్ట్రాలపై పూర్తి వివక్ష చూపిస్తున్నదని కాంగ్రెస్ ఎంపీ, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ ఆరోపించారు. ఇలాంటి సమయంలో దేశాన్ని విడగొట్టి.. దక్షిణాది రాష్ట్రాలకు ప్రత్యేక దేశాన్ని ప్రకటించాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రప్రభుత్వం పన్నులను దక్షిణాది నుంచి ఉత్తరాదికి మళ్లిస్తున్నదని ఆరోపించారు. దక్షిణాదిపై కేంద్రం వివక్షను ఇలాగే కొనసాగిస్తే, దక్షిణాది రాష్ట్రాల ప్రజల కోసం ప్రత్యేక దేశం డిమాండ్ తీసుకొస్తామన్నారు. దక్షిణాది ప్రాంతంపై హిందీ ప్రాంతవాసులు చూపుతున్న వివక్ష కారణంగా.. వేరే గతి లేకనే ప్రత్యేక దేశం డిమాండ్ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం కేంద్రం మధ్యంతర బడ్జెట్ ప్రకటించిన సందర్భంగా సురేశ్ లోక్‌సభలో మాట్లాడారు. 'గ్రాంట్ల వివక్షను సరిచేయకపోతే ప్రత్యేక దేశం ఇవ్వండి. గ్రాంట్లలో వివక్ష ఇలాగే కొనసాగితే దక్షిణ భారతీయులు ప్రత్యేక దేశం కోసం గళం విప్పడం అనివార్యమవుతుంది. కేంద్ర నిధుల్లో మా వాటా మాకు అందడం లేదు. మా డబ్బును ఉత్తర భారతానికి ఇస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్ని విషయాల్లోనూ కేంద్రం అన్యాయం చేస్తున్నది. హిందీ వాళ్లు మాపై పెత్తనం చేస్తున్నారు' అని ఆయన ధ్వజమెత్తారు.


డీకే సురేశ్

### ఇటలీకి వెళ్లిపోవచ్చు

కాంగ్రెస్ ఎంపీ సురేశ్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. దేశాన్ని మళ్లీ విభజించడానికి కాంగ్రెస్ భయంకరమైన పన్నాగాన్ని పన్నుతున్నదని ధ్వజమెత్తింది. 'దేశప్రజలు తిరస్కరించడంతో కాంగ్రెస్ వేర్పాటువాదానికి మళ్లీ బీజం వేస్తున్నది. నెహ్రూ వారసత్వాన్ని కొనసాగిస్తూ.. కాంగ్రెస్ ఎంపీ సురేశ్ ప్రత్యేక దేశం డిమాండ్‌ను తెరమీదకు తీసుకొచ్చారు. ఒక వేళ కాంగ్రెస్ నేతలకు దేశంలో ఉండాలని లేకపోతే, వాళ్ల మాతృదేశం ఇటలీకి వెళ్లిపోవచ్చు' అని ఎక్స్ వేదికగా భగ్గుమన్నది. సురేశ్ వ్యాఖ్యలపై ఎథిక్స్ కమిటీ విచారణ చేయించాలని బీజేపీ డిమాండ్ చేసింది. దేశ విభజనపై ఎంపీ సురేశ్ చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఖండించారు. ఇది రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను నీరుగార్చడమేనని మండిపడ్డారు. సురేశ్‌పై పార్లమెంటరీ యాక్షన్ కమిటీ చర్యలు తీసుకోవాలని కోరారు. తామందరం దక్షిణ భారతదేశం నుంచి వచ్చిన వాళ్లమేనని ఈ సందర్భంగా జోషి గుర్తు చేశారు. తాము దేశాన్ని విభజించాలని అనుకోవడం లేదని.. దక్షిణ, ఉత్తర భారతదేశం మొత్తం ఒకటిగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సురేశ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ స్పందించి.. యావత్తు జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

### ఎవరు వ్యాఖ్యానించినా సహించబోం

దేశ విభజనపై డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలను తాము ఎంతమాత్రం సహించబోయేది లేదని తేల్చి చెప్పారు. 'దేశాన్ని విడగొట్టాలంటూ మా పార్టీ నేతలే కాదు ఏ పార్టీవాళ్లు వ్యాఖ్యానించినా మేం ఎంత మాత్రం సహించబోం. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ మనమంతా ఒకటే. మనదంతా ఒకే దేశం. ఎప్పుడూ అలాగే ఉంటాం' అని పేర్కొన్నారు. భారతీయుడినైనందుకు తాను గర్వపడుతున్నానన్నారు. పార్లమెంట్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని సురేశ్‌కు కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ హితవు పలికారు. సురేశ్ విభజన వ్యాఖ్యలపై శుక్రవారం పార్లమెంట్ దద్దరిల్లింది. కాంగ్రెస్ ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సురేశ్ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. నిధుల కేటాయింపుల విషయంలో బీజేపీ సర్కారు దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపిస్తున్నదన్న విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకురావాలన్న ఉద్దేశంతోనే తాను ఈ వ్యాఖ్యలు చేసినట్టు పేర్కొన్నారు.

# 40% కమీషన్‌రాజ్‌ను మించిపోయాం

- కాంగ్రెస్ హయాంలో అవినీతి కట్టలు తెంచుకొంది
- నేనిలా మాట్లాడితే, చెడ్డవాడిగా నాపై ముద్ర వేస్తారు
- అయినా సరే.. నేను చెప్తున్నది ముమ్మాటికీ నిజం
- సొంత పార్టీపై కర్ణాటక కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి శివరాము సంచలన ఆరోపణలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): ఐదు గ్యారంటీల ప్రచారంతో కిందటేడాది కర్ణాటకలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ హయాంలో అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి తంతుపై సొంతపార్టీ నేతలే బహిరంగగా విమర్శలు గుప్పించడం సంచలనంగా మారింది. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో జరిగిన '40% కమీషన్ రాజ్' అక్రమాలతో పోలిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవినీతి అంతకంటే మించిపోయిందని కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి బీ శివరాము సంచలన ఆరోపణలు చేశారు. ఇదే విషయాన్ని సీఎం సిద్ధరామయ్యకు కూడా తెలియజేసినట్టు ఆయన పేర్కొన్నారు.

### మరింత అధ్వానంగా...

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై శివరాము మాట్లాడుతూ.. ''40% కమీషన్ రాజ్' అంటూ గత ఎన్నికల్లో బీజేపీని లక్ష్యంగా చేసుకొని ప్రచారం చేశాం. అలా ఆ ఎన్నికల్లో గెలిచాం. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. పరిస్థితులు బీజేపీ హయాంలో కంటే మరింత అధ్వానంగా తయారయ్యాయి. హసన్ జిల్లాలో అవినీతి పెచ్చరిల్లుతున్నది. ఇది ఇలాగే కొనసాగితే, జిల్లాకు చెడ్డ పేరు వస్తుంది. సీఎం సిద్ధరామయ్యతో కూడా ఇదే విషయాన్ని నేరుగా చెప్పా. ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, దీనిపై వెంటనే దృష్టిసారించాలని విన్నవించా' అని శివరాము పేర్కొన్నారు. ప్రభుత్వం నిలదొక్కుకోవాలంటే అవినీతిని అరికట్టడమే మార్గమన్న ఆయన.. దీనిపై తాను బహిరంగంగా మాట్లాడితే తనను చెడ్డవాడిగా ముద్ర వేస్తారని వాపోయారు. అయినప్పటికీ, తాను చెప్తున్నది ముమ్మాటికీ నిజమని నొక్కిచెప్పారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి పెరిగిపోయిందని తనతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు కూడా ఇదే అనుకొంటున్నట్టు తెలిపారు.



## అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి



న్యూయార్క్: అమెరికాలో చదువుతున్న మరో భారత విద్యార్థి మరణించాడు. నెల రోజుల వ్యవధిలో ఇది నాలుగో మరణం. ఓహియోలోని లిండర్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుతున్న తెలుగు విద్యార్థి శ్రీయాస్‌రెడ్డి బెనిగేరి అనుమానాస్పద స్థితిలో మరణించినట్టు న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం తెలిపింది. అతడి మరణానికి కారణాలు ఇంకా తెలియరాలేదని, పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారని వెల్లడించింది. భారత్‌లోని అతడి కుటుంబసభ్యులతో మాట్లాడామని, అన్ని రకాల సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. కాగా, అమెరికాలో ఈ నెల రోజుల్లో భారత విద్యార్థులు నీల్ ఆచార్య, వివేక్ సైనీ, అకుల్ బీ ధావన్ మరణించిన విషయం తెలిసిందే.

## కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. బీటెక్ ఆఖరి ఏడాది విద్యార్థి పేయింగ్ గెస్ట్ రూమ్‌లో బలన్మరణానికి పాల్పడినట్టు శుక్రవారం పోలీసులు తెలిపారు. యూపీకి చెందిన నూర్ మహ్మద్ (27) కోటాలో 2016 నుంచి 2019 వరకు ఎంట్రన్స్ ఎగ్జామ్‌కు కోచింగ్ తీసుకున్నాడు. తర్వాత చెన్నైలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నప్పటికీ విజ్ఞాన్ నగర్‌లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటూ ఆన్‌లైన్ ద్వారానే తరగతులకు హాజరవుతున్నాడు.

## రూ. 29కే భారత్ రైస్

న్యూఢిల్లీ: దేశంలో బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో సామాన్యులకు ఊరట కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. వచ్చేవారం నుంచి భారత్ రైస్ పేరుతో రూ.29కే కిలో చొప్పున బియ్యం విక్రయించనున్నట్టు కేంద్ర ఆహారశాఖ కార్యదర్శి సంజీవ్‌చోప్రా శుక్రవారం తెలిపారు. నాఫెడ్, నేషనల్ కోఆపరేటివ్ కన్జ్యూమర్స్ ఫెడరేషన్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్), కేంద్రీయ భండార్ ద్వారా చౌక బియ్యాన్ని 5, 10 కిలోల ప్యాకెట్ల రూపంలో విక్రయించనున్నట్టు వెల్లడించారు. ప్రముఖ ఈకామర్స్ వెబ్‌సైట్లలోనూ ఈ బియ్యం లభిస్తాయన్నారు.

## ఐఐటీ మద్రాస్‌లో స్పోర్ట్స్ కోటా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: దేశ ఐఐటీల చరిత్రలో మొట్టమొదటిసారిగా ఐఐటీ మద్రాస్ స్పోర్ట్స్ కోటా అమలు చేయనుంది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ప్రతి యూజీ కోర్సులో రెండు సీట్లను అత్యుత్తమ క్రీడాకారులకు కేటాయించనుంది. ఇందులో ఒకటి జనరల్-న్యూట్రల్‌కు, ఒకటి మహిళలకు కేటాయిస్తామని ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోటి తెలిపారు. 'స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అడ్మిషన్(ఎస్ఈఏ) కార్యక్రమం ద్వారా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సూపర్ న్యూమరరీ సీట్ల ద్వారా ప్రవేశం కల్పించి ప్రోత్సహిస్తాం. అని ఆయన వెల్లడించారు.

## మరో నౌకను రక్షించిన భారత నేవీ

న్యూఢిల్లీ: అరేబియాలో సముద్ర దొంగల బారి నుంచి వివిధ దేశాల నౌకలకు భారత నేవీ అండగా నిలుస్తున్నది. తాజాగా సోమాలియా తూర్పు తీరంలో సముద్రపు పైరేట్ల నుంచి ఇరాన్ నౌకను నేవీ రక్షించింది. భారత నౌకాదళ అధికార ప్రతినిధి కమాండర్ వివేక్ మధ్వల్ తెలిపిన వివరాల ప్రకారం ఏడుగురు దొంగలు శుక్రవారం తెల్లవారుజామున ఎఫ్‌వీ ఒమైల్ నౌకను దోచుకోవాలని ప్రయత్నించారు. నౌకలోని 11 మంది ఇరానియన్లు, 8 మంది పాకిస్థానీ సిబ్బందిని బందీలను చేసుకున్నారు. సోమాలియా దొంగల దాడిని గమనించిన భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ శారద వెంటనే రంగంలోకి దిగి బాధితులకు విముక్తి కల్పించింది.

## 12 ఏండ్లుగా గదిలోనే భార్య నిర్బంధం!

మైసూరు: కర్ణాటకలోని మైసూరుకు చెందిన ఓ వ్యక్తి 12 ఏండ్లుగా తన భార్యను ఇంట్లోనే బందీని చేశాడు! రోజూ తాను ఉద్యోగానికి బయటికి వెళ్లేటప్పుడు భార్యను ఇంట్లోనే ఉంచి తాళం వేసుకొని వెళ్లేవాడు. తనను బంధించిన గదిలోనే ఒక చిన్న పెట్టెలో కాలకృత్యాలు తీర్చుకొనే దానినని బాధితురాలు వాపోయింది. విషయం తెలిసిన పోలీసులు ఆమె భర్తకు ఈ విషయమై కౌన్సెలింగ్ ఇచ్చారు. భర్తపై ఫిర్యాదు చేయడానికి బాధితురాలు నిరాకరించింది. ఇకపై పుట్టింట్లో ఉంటానని తెలిపింది.

## సనాతన ధర్మంపై వ్యాఖ్యలు.. ఉదయనిధి స్టాలిన్‌కు కోర్టు సమన్లు

బెంగళూరు, ఫిబ్రవరి 2: హిందూ సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు సీఎం స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు బెంగళూరు కోర్టు సమన్లు జారీ చేసింది. బెంగళూరుకు చెందిన పరమేశ్ అనే వ్యక్తి దాఖలు చేసిన ఫిర్యాదుపై మార్చి 4న వ్యక్తిగతంగా తమ ముందు హాజరు కావాలంటూ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశించింది.

## కేంద్రానికి వ్యతిరేకంగా కేరళ అసెంబ్లీ తీర్మానం


తిరువనంతపురం: నిధులు విడుదల చేయకుండా ఆర్థికంగా తమను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కేంద్రం వైఖరిపై కేరళ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆర్థికంగా రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తూ కేంద్రం దేశ సమాఖ్య నిర్మాణాన్ని నాశనం చేస్తున్నదని ఆరోపిస్తూ కేరళ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. విపక్షం సభలో లేనప్పటికీ తీర్మానానికి ఏకగ్రీవంగా ఆమోదం లభించిందని అసెంబ్లీ స్పీకర్ షంషీర్ ప్రకటించారు. ఇటీవల కేంద్రం రాష్ట్ర రుణ పరిమితిని దారుణంగా తగ్గించిందని, రెవెన్యూ లోటు గ్రాంటునూ తగ్గించిందని కేరళ ఆర్థిక మంత్రి బాలగోపాల్ తెలిపారు.

# కబళిస్తున్న క్యాన్సర్

## భారత్‌లో 2022లో 14.1 లక్షల కేసులు.. 9.1 లక్షల మందికిపైగా మృత్యువాత

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి కోరలు చాస్తున్నది. ఇటీవల కాలంలో క్యాన్సర్ కేసులు, మరణాలు భారీగా పెరుగుతున్నాయి. ఒక్క భారత్‌లోనే 2022లోనే 14.1 లక్షల క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. 9.1 లక్షల మంది మృతి చెందారు. భారత్‌లో అత్యధిక మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో క్యాన్సర్ రెండో స్థానంలో ఉన్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తాజా నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. మహిళల్లో గర్భాశయ క్యాన్సర్‌ను నిర్మూలించటానికి 15 ఏండ్ల వయసు నిండక ముందే హెచ్‌పీవీ టీకాలు వేయించాలని డబ్ల్యూహెచ్‌వో సూచించింది.



### 2022లో క్యాన్సర్ కేసులు, మరణాలు

భారత్‌లో నమోదైన కేసులు: 14.1 లక్షలు
ప్రపంచవ్యాప్తంగా నమోదైన కేసులు: 2 కోట్లు
నమోదైన మరణాలు (భారత్): 9.1 లక్షలు
నమోదైన మరణాలు (ప్రపంచవ్యాప్తంగా): 97 లక్షలు

పురుషుల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లు- పెదవి, నోటి కుహర
మహిళ లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లు- రొమ్ము, గర్భాశయ

75 ఏండ్లలోపు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్నవారు
భారత్‌లో: 10.6 శాతం
ప్రపంచవ్యాప్తంగా: 20 శాతం

ప్రతి లక్ష మందిలో క్యాన్సర్ మరణాలు ఖండాల వారీగా..
యూరప్ 82
ఆఫ్రికా 72
ఆసియా 62



## రాజకీయాల్లోకి విజయ్



### 'తమిళ వెట్రి కళగం' పేరుతో పార్టీ స్థాపన

చెన్నై, ఫిబ్రవరి 2: తమిళ నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రం చేశారు. 'తమిళ వెట్రి కళగం' పేరుతో కొత్త పార్టీని స్థాపించారు. తమిళ వెట్రి కళగం అంటే తమిళనాడు విజయ పార్టీ అని అర్థం. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. తమిళనాడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వెల్లడించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు దారుణంగా తయారయ్యాయని, అవినీతి రాజ్యమేలుతున్నదని వ్యాఖ్యానించారు. కుల, మతాలతో రాజకీయాలు జరుగుతున్నాయని తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా అడుగులు వేద్దామని అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయటం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే పార్టీ పేరు రిజిస్ట్రేషన్ కోసం ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసినట్టు వివరించారు. పార్టీ జెండా, అజెండాను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు.

# బీజేపీ ఓట్ల రిగ్గింగ్.. ఈవీఎంల ట్యాంపరింగ్

- చండీగఢ్ మేయర్ ఎన్నికలతో మరోసారి రుజువైంది
- కమలం పార్టీ అక్రమాలను ఐక్యంగా ఎదుర్కోవాలి
- ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడటం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యాంత్రాలు (ఈవీఎం)లను ట్యాంపరింగ్ చేయటం బీజేపీకి అలవాటేనని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఢిల్లీలోని ఆప్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ కేంద్రం శక్తియుక్తులన్నీ ప్రయోగించి చండీగఢ్ మేయర్ ఎన్నికలను తారుమారు చేసిందని మండిపడ్డారు. 'బీజేపీ నేతలు ఎన్నికల సమయంలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించి, బోగస్ పేర్లు చేరుస్తారని, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తారని ఎన్నో ఏండ్ల నుంచి వింటున్నాం. కానీ ఇంతవరకు ఆధారాలు దొరకలేదు. కానీ ఇప్పుడు దేశమంతా చండీగఢ్‌లో ఏం జరిగిందో చూసింది. ప్రిసైడింగ్ ఆఫీసర్ కౌన్సిలర్ల ఓట్లు చెల్లవంటూ ఎలా వ్యవహరించారో అందరూ చూశారు' అని పేర్కొన్నారు. బీజేపీ ఎన్నికల అక్రమాలు బట్టబయలైన నేపథ్యంలో ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ అయిన బీజేపీ ఓట్లను దొంగిలించిందని దుయ్యబట్టారు. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అక్రమాలపై ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆప్, కాంగ్రెస్ నేతలు ఆందోళన నిర్వహించారు.



### ఈడీ విచారణకు ఐదోసారి కేజ్రీవాల్ గైర్హాజరు

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ విచారణకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మరోసారి గైర్హాజరు అయ్యారు. ఇప్పటికే నాలుగు సార్లు గైర్హాజరు అయిన విషయం తెలిసిందే. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ స్పందిస్తూ 'మా నాయకుడికి ఈడీ చీటికిమాటికి నోటీసులు పంపుతున్నది. అక్రమంగా నోటీసులు పంపి కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలని చూస్తున్నది. దీని వెనుక ఎవరున్నారో అందరికీ తెలుసు. ఢిల్లీ ప్రభుత్వాన్ని పడగొట్టాలన్నదే వారి లక్ష్యం. ఇది నెరవేరనివ్వం' అని పేర్కొంది.

## జ్ఞానవాపిలో పూజలపై స్టేకు నిరాకరణ

### తదుపరి విచారణ 6కు వాయిదా

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసి జిల్లా కోర్టు తీర్పు మేరకు జ్ఞానవాపి మసీదు దక్షిణ సెల్లార్‌లో హిందూ దేవతలకు జరుగుతున్న పూజలను నిలిపేసేందుకు అలహాబాద్ హైకోర్టు శుక్రవారం తిరస్కరించింది. తదుపరి విచారణ ఈ నెల 6న జరుగుతుంది. జిల్లా కోర్టు తీర్పును సవాల్ చేస్తూ మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించి, హైకోర్టుకు వెళ్లాలని సలహా ఇచ్చింది. ఈ కమిటీ తరఫు న్యాయవాది ఎస్ఎఫ్ఏ నక్వీ వాదనలు వినిపిస్తూ, జిల్లా కోర్టు చాలా ఆత్రుతగా ఈ తీర్పు చెప్పిందని, న్యాయమూర్తి పదవీ విరమణ రోజునే తీర్పు చెప్పారని తెలిపారు. తాము సమర్పించిన పత్రాలను ఈ తీర్పు చెప్పడానికి ముందు న్యాయమూర్తి పరిశీలించలేదని చెప్పారు. దీనిపై హిందూ పక్షం న్యాయవాది విష్ణు శంకర్ జైన్ స్పందిస్తూ, జిల్లా కోర్టు జనవరి 17న ప్రాపర్టీ రిసీవర్‌గా వారణాసి జిల్లా కలెక్టర్‌ను నియమించిందని, అందుకు అనుగుణంగానే ఆయన జనవరి 24న ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. జనవరి 31న వెలువడిన ఆర్డర్ కేవలం అనుబంధ ఆదేశాలేనని చెప్పారు. జ్ఞానవాపిలో పూజలకు అనుమతించడాన్ని నిరసిస్తూ మసీదు కమిటీ పిలుపు మేరకు వారణాసిలో శుక్రవారం బంద్ జరిగింది.





### ఐయూఎంఎల్ నిరసన

ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీలు శుక్రవారం పార్లమెంట్ కాంప్లెక్స్‌లో 'జ్ఞానవాపి మసీదును కాపాడండి' అని ప్లకార్డులను ప్రదర్శించారు.

# జార్ఖండ్ సీఎంగా చంపయీ ప్రమాణం

- 5న అసెంబ్లీలో బలపరీక్ష
- హైదరాబాద్‌కు చేరుకున్న జేఎంఎం ఎమ్మెల్యేలు

రాంచీ/హైదరాబాద్,(నమస్తే తెలంగాణ) ఫిబ్రవరి 2: జార్ఖండ్ నూతన ముఖ్యమంత్రిగా చంపయీ సొరేన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ రాజ్‌భవన్‌లో ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఆలంగీర్ ఆలమ్, ఆర్జేడీ నేత సత్యానంద్ భోక్త రాష్ట్ర మంత్రులుగా ప్రమాణం చేశారు. జేఎంఎం, దాని సంకీర్ణ పార్టీల నేతలు ఈ కార్యక్రమానికి విచ్చేశారు. 67 ఏండ్ల చంపయీ సొరేన్ జార్ఖండ్‌కు 12వ ముఖ్యమంత్రి. జార్ఖండ్ రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉంటానని, హేమంత్ సొరేన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తానని ఆయన ప్రమాణ స్వీకారం అనంతరం మీడియాకు తెలిపారు. కుట్ర చేసి ఒక గిరిజన సీఎంను ఎలా అరెస్ట్ చేశారో దేశమంతా చూస్తున్నదన్నారు. అనంతరం తొలిసారిగా చంపయీ నేతృత్వంలో సమావేశమైన మంత్రివర్గం ఈ నెల 5న అసెంబ్లీలో బలపరీక్షకు సిద్ధమవ్వాలని నిర్ణయించింది.



హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న జేఎంఎం ఎమ్మెల్యేలు. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న చంపయీ సొరేన్

### ఈడీ కస్టడీకి మాజీ సీఎం

భూ కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలతో అరెస్టయిన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను ఐదు రోజుల పాటు ఈడీ కస్టడీకి పంపుతూ ప్రత్యేక ఎంఎల్ఏ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టులో హేమంత్ సొరేన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తన అరెస్టును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. హైకోర్టుకు వెళ్లాలని సూచించింది.

### హైదరాబాద్‌లో జార్ఖండ్ క్యాంప్ రాజకీయం

జార్ఖండ్ క్యాంపు రాజకీయాలకు తెలంగాణ వేదికగా నిలిచింది. ఆ రాష్ట్ర కొత్త సీఎంగా ప్రమాణం చేసిన చంపయీ 5న బల నిరూపణ చేసుకోవాలి. దీంతో ఎమ్మెల్యేలు చేజారిపోకుండా హైదరాబాద్ క్యాంపునకు తరలించారు. జేఎంఎం సర్కార్‌లో కాంగ్రెస్ భాగస్వామి కావడంతో ఈ క్యాంప్‌కు తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఆతిథ్యం ఇస్తున్నది. శుక్రవారం రాంచీ నుంచి 2 ప్రత్యేక విమానాల్లో 40 మంది ఎమ్మెల్యేలు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు స్వాగతం పలికి శామీర్‌పేటలోని లియోనియా రిసార్ట్స్‌కు తరలించారు.